


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


పరిసరాల శుభ్రత- ఆరోగ్య భద్రత




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 222 పేజీలు - 08 వెల - 05/-

శనివారం 08-08-2026


# చట్టం చేస్తున్నాం...

## బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

--కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు



- చేనేతలకు మేలు చేసేది... అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- ఆర్థిక కష్టాలున్నా సంక్షేమం-అభివృద్ధిలో రాజీపడడం లేదు
- 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని అవసరం
- మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్

44 ఏళ్లు వస్తే వయసైపోయినట్టా... ?



చీరాల, ఆగస్టు 7: బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్దమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక

మిగతా 2లో

# జెన్-జీ పై

## మోహన్ భగవత్ వ్యాఖ్యలు..

● బీజేపీ, ఆరెస్సెస్ మధ్య సమన్వయం కొరవడిందన్న దీప్కే ● జెన్-జీ నిరసనకారులు దేశ వ్యతిరేకులు కారని చెప్పిన భగవత్ ● భగవత్ మాటలను బీజేపీ నేతలు పాటించాలని అభిజిత్ దీప్కే సూచన ● బీజేపీ నేతల పాత వ్యాఖ్యలను గుర్తు చేసిన అభిజీత్ దీప్కే ● ఇది సంఘ్ పరివార్‌లోని విభేదాలకు సంకేతమని వ్యాఖ్య



2

బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) మధ్య సమన్వయం లోపించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శించారు. జెన్-జీ యువతపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేతలు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

## హైదరాబాద్‌లో మరో భారీ

# బస్ టెర్మినల్!



- హైదరాబాద్‌లో ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- గాజులరామారంలో 100 ఎకరాల్లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం
- విషయాన్ని లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- హెచ్ఎంటీ స్థలం లీజు ప్రతిపాదన విఫలమవడంతో కొత్త నిర్ణయం
- నగరంలోకి రాకుండా అంతర్రాష్ట్ర బస్సుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని

మిగతాది 2లో

# డీఎస్సీ లీకేజీపై సీబీఐ

## విచారణకు భయమెందుకు?: జగన్

● డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన ● లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ ● డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్

● విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్



2

డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయి



## తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం

2లో



# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో

## బీజేపీ ఒంటరి పోరు: రామచందర్

- రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం
- మండల, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యమన్న నేతలు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి

మిగతాది 2లో

## స్వలింగ సంపర్కుల

# సహజీవనానికి ఓకే...

● స్వలింగ సంపర్కుల సహజీవనానికి చట్టబద్ధత కల్పించాలన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ ● అయితే వారి వివాహాన్ని గుర్తించవద్దన్న మోహన్ భగవత్ ● సామాజిక వివక్ష ఉన్నంతకాలం రిజర్వేషన్లు అవసరమేనని స్పష్టీకరణ ● సంఘ్‌లో మహిళల పాత్ర సమానమైనది, పరిపూరకమైనదని వ్యాఖ్య





రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ స్వలింగ సంపర్కుల సంబంధాలు, రిజర్వేషన్లు, మహిళల పాత్ర వంటి పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. ముంబైలో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్ (××వీఖచీ) కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్వలింగ సంపర్కుల (గా+దీ) సహజీవనానికి చట్టపరమైన గుర్తింపు ఉండాలని, అయితే వారి బంధాన్ని వివాహంగా గుర్తించడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. స్వలింగ సంపర్కులు కూడా సమాజంలో భాగమేనని, వారికి తగిన

మిగతాది 2లో

# కాంగ్రెస్ ఉద్యమం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ స్పందన

- విద్యార్థుల సమస్యలను రాహుల్ గాంధీ ముందే ప్రస్తావించారని వెల్లడి
- ప్రజల నాడిని పట్టుకోవడంలో కాంగ్రెస్ వెనుకబడిందని అంగీకారం
- 2029 ఎన్నికల్లో జెన్-జీ ఓటర్లు అత్యంత కీలకం కానున్నారని వ్యాఖ్య



కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల్లో అక్రమాలపై తమ పార్టీ నేత రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమానికే ప్రజల నుంచి, ముఖ్యంగా

మిగతాది 2లో

# మెటాకు భారీ షాక్..

## రూ.వేల కోట్ల జరిమానా విధించిన అమెరికా కోర్టు

- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల వల్ల యువతకు హాని కలిగిందని నిర్ధారణ
- మొత్తం 567 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం





2

# భయపడొద్దు, నేనున్నాను:

## టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు.





"ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో

మిగతాది 2లో

# స్వలింగ సంపర్కుల సహజీవనానికి ఓకే...

కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్వలింగ సంపర్కుల (గా+దీ) సహజీవనానికి చట్టపరమైన




గుర్తింపు ఉండాలని, అయితే వారి బంధాన్ని వివాహంగా గుర్తించడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. స్వలింగ సంపర్కులు కూడా సమాజంలో భాగమేనని, వారికి తగిన స్థానం కల్పించాలని భగవత్ అన్నారు. వారి సహజీవనం కోసం స్పష్టమైన నియమాలు, చట్టాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, దీనిని వివాహ వ్యవస్థతో ముడిపెట్టవద్దని స్పష్టం చేశారు. "భారతీయ సమాజంలో వివాహం అంటే కేవలం ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించడం మాత్రమే కాదు. మంచి సంతానాన్ని పెంచి, బలమైన సమాజాన్ని నిర్మించేందుకు ఏర్పాటు చేసుకున్న ఒక పవిత్రమైన వ్యవస్థ. ప్రస్తుతం ఉన్న ఈ విధానాన్ని మార్చడం వల్ల అనవసర సంఘర్షణలు తలెత్తుతాయి. అందుకే స్వలింగ సంపర్కుల కలయికను వివాహంగా పరిగణించకూడదు" అని ఆయన వివరించారు. ఇతర అంశాలపై మాట్లాడుతూ, సామాజిక వివక్ష ఉన్నంత కాలం దేశంలో రిజర్వేషన్లు అవసరమేనని భగవత్ పునరుద్ఘాటించారు. దీనిని రాజకీయ అంశంగా మార్చవద్దని హితవు పలికారు. సరిదిద్దే చర్యలను నిజాయతీగా అమలు చేస్తే, భవిష్యత్తులో రిజర్వేషన్ల అవసరం లేకుండా పోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా, పాకిస్థాన్‌తో సంబంధాల గురించి ప్రస్తావిస్తూ, సంఘర్షణల సమయంలో ప్రజలు ప్రభుత్వం చెప్పిన దానినే అనుసరించాలని సూచించారు. శాంతి, సామరస్యంతో మెలగడమే భారతీయ పరిష్కారమని, శాశ్వత ద్వేషం ఉండకూడదని, ఎందుకంటే మానవత్వం ఒక్కటేనని అన్నారు. సంఘ్‌లో మహిళల పాత్రపై స్పందిస్తూ, వారి పాత్ర పురుషులతో సమానమైనదని, ఒకరికొకరు పరిపూరకమైనవారని తెలిపారు. ఇరు వర్గాల కార్యకలాపాల్లో జోక్యం ఉండకూడదనే ఉద్దేశంతోనే మహిళల కోసం ప్రత్యేక సమాంతర సంస్థ ఉందని, సంఘ్‌లో మహిళలకు స్థానం లేదనే వాదనను ఆయన తోసిపుచ్చారు.

---

# జెన్-జీ పై మోహన్ భగవత్ వ్యాఖ్యలు..

శుక్రవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంబైలో జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా దీప్కే ప్రస్తావించారు. "నిరసనలు తెలుపుతున్న జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదు, వారి ఆందోళనల్లో నిజాయతీ ఉంది, వారికి నిరసన తెలిపే హక్కు ఉంది" అని మోహన్ భగవత్ స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీజేపీకి మార్గదర్శిగా ఉన్న భగవత్ మాటలను ఆ పార్టీ నాయకత్వం వినాలని హితవు పలికారు. గతంలో జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరిగినప్పుడు బీజేపీ నేత నితిన్ నబిన్ ఆందోళనకారులను 'వైరస్' అని, కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఉగ్రవాదుల బీ టీమ్' అని వ్యాఖ్యానించిన విషయాన్ని అభిజిత్ దీప్కే గుర్తు చేశారు. వారి మార్గదర్శి మాటలనే బీజేపీ నేతలు ఖాతరు చేయకపోవడం సరికాదని ఆయన అన్నారు. ఈ అంశంపై మోహన్ భగవత్ నేరుగా బీజేపీ నాయకత్వంతో మాట్లాడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భిన్నమైన వైఖరులు విస్తృత సంఘ్ పరివార్‌లో ఉన్న అంతర్గత విభేదాలను సూచిస్తున్నాయని అభిజిత్ దీప్కే పేర్కొన్నారు. తమ పార్టీ ఏ రాజకీయ భావజాలానికి కట్టుబడి ఉండదని, కేవలం దేశం, యువతకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బృందంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# మెటాకు భారీ షాక్.. రూ.వేల కోట్ల జరిమానా విధించిన అమెరికా కోర్టు

సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది.

ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

# జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు: రామచందర్ రావు

ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ




అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు.తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# చట్టం చేస్తున్నాం...బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.

**బీసీలకు అండగా...**

"బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా... గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

లికుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధానిలి

"గత పాలనలో రాజధాని లేకుండా చేశారు... రాష్ట్రం పేరు చెబితే ఇతర ప్రాంతాల్లో చులకన అయ్యేలా చేశారు. అద్భుతమైన నగరం ఉండాలనే అమరావతిని నిర్మిస్తున్నాం. రాజధానిపై గత పాలకులు నాలుక మడతపెట్టారు. మూడు ముక్కలాట ఆడారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమైనా తమ రాజధాని నగరాలను ఘనంగా చెప్పుకుంటున్నాయి. గత పాలనలో రాజధానే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. ఆగస్టు 13 తేదీన రాజధానిలోని ప్రధాన రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. వేగంగా జరుగుతున్న పనులు చూసి రాజధానిపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు. మావిగన్, వాటికన్ అంటూ ఏవోవో చెబుతున్నారు. మళ్లీ మూడు ముక్కలాట కావాలా...? రాజధానిని విధ్వంసం చేసుకుంటామా..? కుటుంబానికి ఇల్లు, రాష్ట్రానికి రాజధాని అవసరం. గత ప్రభుత్వం రాష్ట్ర పరువును తీసేసింది. ఇమేజ్ ను దారుణంగా దెబ్బతీసింది. కూటమి వచ్చాక మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. వాళ్లది బ్యాడ్ ఇమేజ్... మాది బ్రాండ్ ఇమేజ్. కోర్టు కేసులు వేసి అడ్డుకున్నా మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఏడాదిన్నర తర్వాత ఇప్పుడు మళ్లీ పేపర్ లీక్ అంటూ కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. కోర్టు చీవాట్లు పెట్టినా... మళ్లీ ధర్నాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తూ ప్రజలను వేధిస్తున్నారు. జెన్-జీ యువత అభివృద్ధిని కోరుకుంటోంది. కానీ కొందరు గొడ్డలి జనరేషన్ కు చెందిన వారు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. వీళ్లది గొడ్డలి జె. అభివృద్ధిని అడ్డుకునేలా చేసే అరాచకాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. కఠిన చర్యలకు వెనుకాడం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

లికుట్రలను గమనించాలి... కుట్రదారులను దూరంపెట్టాలిలి

"గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను నేరాలు, ఘోరాలు చేసే వ్యక్తుల్ని ప్రోత్సహిస్తూ కొందరు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. యాక్సిడెంట్ చేస్తే గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లాలి... కానీ ఆధారాలు తారుమారు చేసేసి, వ్యక్తులను మార్చేసి కుట్రలు చేసి కేసు మాఫీ చేసేందుకు ప్రయత్నించారు. 44 ఏళ్ల వ్యక్తి చనిపోతే ఇబ్బందేమిటని మాట్లాడతారు. ఇదెక్కడి విడ్డూరం... ఇలాంటి వారిని ఏమనాలి..? పరామర్శల కోసం గంటల పాటు రోడ్లను నిర్బంధించి వెకిలి చేష్టలు చేస్తున్నారు.

## కాంగ్రెస్ ఉద్యమం కన్నా
# సీజేపీ ఉద్యమానికే ఎక్కువ స్పందన

. 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమానికే ప్రజల నుంచి, ముఖ్యంగా విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన అంగీకరించారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో శశిథరూర్ మాట్లాడుతూ, "సీజేపీ చేపట్టిన అంశాలనే మా పార్టీ, రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' ద్వారా కొన్నిరోజుల ముందే లేవనెత్తారు. కానీ ఆ ప్రచారానికి ఎందుకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదో మేం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజల నాడిని మేము సరిగ్గా పట్టుకోవాలి" అని వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లోని కోటాలో జూన్ 17న రాహుల్ గాంధీ ఈ ప్రచారాన్ని ప్రారంభించగా, సీజేపీ నిరసనలు జూన్ 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మొదలయ్యాయి. సీజేపీ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించి, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన విషయాన్ని శశిథరూర్ ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు. 2029 నాటికి 'జెన్-జీ' అతిపెద్ద ఓటింగ్ వర్గంగా మారుతుందని, వారి ఆకాంక్షలను రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాలని శశిథరూర్ సూచించారు. "వీధిలో చేయాల్సిన పోరాటం వీధిలో, సభలో చేయాల్సిన పోరాటం సభలో చేయాలి" అంటూ తమ పార్టీ వ్యూహంపై తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు. ఐఐఎంయూఎన్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరుకావడం, అదే వేదికపై శశిథరూర్ కూడా కనిపించడంపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. భిన్నమైన అభిప్రాయాలు ఉన్నవారితో చర్చించవద్దని చెప్పడం సరికాదని, తాను కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగానే ఉంటూ తన స్వతంత్ర అభిప్రాయాలను వ్యక్తం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## భయపడొద్దు, నేనున్నాను:
# టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

# హైదరాబాద్‌లో మరో భారీ బస్ టెర్మినల్

లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్‌ఆర్టీసీ గతంలో హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్‌ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్‌ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్‌ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?: జగన్

డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు. 1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.

2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. 3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి. "చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## నంద్యాల పట్టణంలోని పేద ప్రజల ఇండ్ల స్థలాల కొరకు ఈనెల 11 న ఆర్ఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా.







పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని నిరుపేద ప్రజలు సొంత ఇల్లు లేక అవస్థలు పడుతున్నారు ఇంటి అద్దెలు కట్టుకోలేక చాలా ఇబ్బందులు పడుతు జీవనం సాగిస్తున్నారు. కానీ ఈ రాజకీయ పార్టీలు ఏ మాత్రం పట్టించుకోవట్లేదు. పార్టీ నాయకులు ఎంతో మంది ఎమ్మెల్యేలు మారిపోతున్న ఇల్లు లేని వారికి సెంటు స్థలము ఇచ్చిన పాపాన పోలేదు. ఎంతసేపు ప్రజలను ఓటుకు మాత్రమే పరిమితం చేస్తూ మాయమాటలు చెప్పి ఓట్లను వేయించుకుంటున్నారు, తప్ప వారి జీవితాలు మారలేదు. అందుకు ఇల్లు లేని నిరుపేదలను కలుపుకొని నంద్యాల మున్సిపల్ ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించడం జరుగుతుంది. గతంలో కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించి కలెక్టర్ తో మాట్లాడగా మున్సిపల్ కమిషనర్ కి అప్పజెప్పారు. వారు మీ వార్డు సచివాలయాల దగ్గర ఇళ్ల స్థలాలకు అప్లికేషన్ ఇవ్వమని చెప్పగా ఇల్లు లేని నిరుపేదలందరూ మున్సిపల్ కమిషనర్ చెప్పినట్టుగానే అప్లికేషన్లు ఇచ్చారు. అప్లికేషన్ ఇచ్చిన ఇంతవరకు ఏ మాత్రం పట్టించుకోలేదు. కాబట్టి ఈ ధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఆర్ఎస్పి రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు నుంచి 20 కుటుంబాలు పార్టీలో చేరడం జరిగింది. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించడం జరిగింది. వారి పేర్లు బిబి చాంద్బి శివమ్మ ఈశ్వరమ్మ ముంచాబి దస్తగిరమ్మ జైనాబి అబ్దుల్లా రహమతుల్లా శివయ్య ఇతరులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య నాయకురాళు నంద్యాల టౌన్ కార్యదర్శి లక్ష్మి సహాయ కార్యదర్శి ముంచాబి సువర్ణ పద్మ మేరీ అదేవిధంగా ఆర్ఎస్పీ పార్టీ నుండి నంద్యాల జిల్లా కార్యదర్శి అప్పపోగు సుబ్బరాయుడు రాష్ట్ర సమితి సభ్యుడు షేక్ బాషా వీరికి అందరికీ ఆహ్వానించి కండువా వేయడం జరిగింది.

## పరిస్థితులకు అనుగుణంగా పంట సాగు చేయాలి.



మహానంది, పల్లె వెలుగు ఎల్నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిందని, పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎల్నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళికపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ..తేలిక రకం పంటలను సాగు చేసుకుంటే తక్కువ నీటి అవసరం ఉంటుందన్నారు.తక్కువ సమయంలో అధిక దిగుబడులు సాధించే పంటలను సాగు చేస్తే నష్టాలబారి నుంచి బయటపడే అవకాశం ఉందని స్పష్టం చేశారు.మండలంలోని గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్లో రైతుల కమతాలను సందర్శించి వాతావరణ సానుకూల పంటల ప్రణాళిక ఏర్పాటు చేసుకొని, ఎల్నినో ప్రభావాన్ని తగ్గించి ఆదాయ భద్రతను కాపాడమే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. రైతు కమతాన్ని రైతు సేవా కేంద్ర సిబ్బంది సందర్శించి పంట యొక్క ఆరోగ్య స్థితి, వేసిన పంట వివరాలను ఏపీ ఏఐఎంఎస్ యాప్ లో నమోదు చేయడం చేస్తారన్నారు.పంటకు సంబంధించి సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి సలహాలు ఇవ్వడం, పంట నమోదు, పంట వేయనిచోట ఆరుతడి పంటలు, అంతర పంటలు, మిశ్రమ పంటలు ఉపయోగాల గురించి రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, సత్యనారాయణమ్మ, గ్రామ ఉద్యాన అధికారి సుభాష్ చంద్ర బోస్, ఎంపీఈవోలు రేవతి, మాధవి లత, రైతులు పాల్గొన్నారు.

## తిమ్మాపురంలో జియారత్ వేడుకలు



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని పెద్ద మౌలాలి, చిన్న మౌలాలి, దస్తగిరి స్వామి వార్ల జియారాత్ వేడుకలు శుక్రవారం ముగిశాయి.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మహానంది ఎస్ఐఎన్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. గురువారం రాత్రి భక్తులు స్వామివారిని దర్శించుకుని పూల సూచికలు సమర్పించి,ప్రత్యేక ప్రార్ధనలు (ఫాతేహాలు) నిర్వహించుకుని ముక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల కోలాట ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలను వీక్షించేందుకు గ్రామస్తులే కాక పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రధాన రహదారుల గుండా డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ యువకుల నృత్యాలతో స్వాముల పీర్లు ఊరేగింపు వైభవంగా ముగిసింది.భక్తిశ్రద్ధలతో కులమతాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాములను దర్శించుకున్నారు.

## శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు
## ఆధునిక ఫార్మాస్యూటికల్ విశ్లేషణ పరికరాలపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ





పాణ్యం ఆగస్టు 7 పల్లె వెలుగు : శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నంద్యాలలో స్కిల్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల,కర్నూలుకు చెందిన బి.ఎస్సి. మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ మరియు జువాలజీ విద్యార్థుల కోసం రెండు రోజుల "మోడర్న్ స్పెక్ట్రోస్కోపిక్, క్రోమాటోగ్రాఫిక్ అండ్ ఫార్మాస్యూటికల్ అనలిటికల్ టెక్నిక్స్" నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంఘనంగా నిర్వహించారు.కార్యక్రమాన్ని శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. సి. మధుసూదన చెట్టి ప్రారంభించి మాట్లాడుతూ,ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం సైద్ధాంతిక పరిజ్ఞానంతోనే కాకుండా ఆధునిక ప్రయోగశాల పరికరాలపై ప్రత్యక్ష అవగాహన, నైపుణ్యాలు కూడా కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించి, ఉన్నత విద్యతో పాటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయని తెలిపారు. సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి కె. వాసవి మాట్లాడుతూ, తమ విద్యార్థులకు అత్యాధునిక ప్రయోగశాల పరికరాలపై ప్రత్యక్ష శిక్షణ అందించే అవకాశం కల్పించిన శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఫార్మాస్యూటిక్స్ విభాగాధిపతి స్కిల్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. ఎ.వి. బద్రీనాథ్ కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించి, శిక్షణ లక్ష్యాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే అంశాలను వివరించారు.రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అధ్యాపకులు విద్యార్థులకు అత్యాధునిక ప్రయోగశాల పరికరాలైన యూవీ-విజిబుల్ స్పెక్ట్రోఫోటోమీటర్, ఎఫ్టీఐఆర్ స్పెక్ట్రోమీటర్, ఫ్లోరోమీటర్, హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రఫీ (హెచ్పీఎల్సీ), ఫ్లేమ్ ఫోటోమీటర్, పీహెచ్ మీటర్, రోటరీ ఎవాపరేటర్, కూలింగ్ సెంట్రిఫ్యూజ్, స్టెబిలిటీ టెస్టింగ్ చాంబర్, మెల్టింగ్ పాయింట్ అపారేటస్, లయోఫిలైజర్, ఫ్రాంజ్ డిఫ్యూషన్ సెల్, టాబ్లెట్ డిస్సల్యూషన్ టెస్ట్ అపారేటస్, టాబ్లెట్ డిస్ఇంటిగ్రేషన్ టెస్ట్ అపారేటస్ మరియు టాబ్లెట్ హార్డ్నెస్ టెస్టర్ వంటి పరికరాల పనితీరు, ఉపయోగాలు, ఔషధ విశ్లేషణలో వాటి ప్రాముఖ్యతపై హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్ అందించారు.విద్యార్థులు స్వయంగా పరికరాలను నిర్వహిస్తూ ప్రయోగాలు చేయడం ద్వారా విశ్లేషణా పద్ధతులను నేర్చుకున్నారు.ప్రతి పరికరం యొక్క పనితీరు, నమూనాల విశ్లేషణ విధానం, డేటా విశ్లేషణ, ఔషధ నాణ్యత నియంత్రణలో వాటి వినియోగంపై నిపుణులైన అధ్యాపకులు సవివరంగా వివరణ అందించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి శిక్షణ ధ్రువపత్రాలు అందజేసి, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అధ్యాపకులు, స్కిల్ డెవలప్మెంట్ సెల్ సభ్యులు, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పెద్ద సంఖ్యలో బి.ఎస్సి. విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కూల్ ఫీజులపై దేశవ్యాప్త ఉద్యమానికి కాక్రోచ్ జనతా పార్టీ సిద్ధం

**'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో తల్లిదండ్రుల అభిప్రాయాల సేకరణకు శ్రీకారం.**




పల్లె వెలుగు న్యూఢిల్లీ. దేశంలో పెరుగుతున్న స్కూల్, కాలేజీ ఫీజులు, కోచింగ్ సెంటర్ల అధిక ఫీజులపై దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. "క్యా బోల్తీ పబ్లిక్" అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి, ముఖ్యంగా తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు భారీగా పెరగడంతో మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. దేశవ్యాప్తంగా స్కూల్ ఫీజులు, కాలేజీల ఫీజు విధానం, కోచింగ్ సెంటర్ల ఫీజులు, విద్యా నాణ్యత, ప్రభుత్వ సంస్కరణలపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తామని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సూచనలను ప్రభుత్వానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. పిల్లల చదువు కోసం అనేక కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, విద్య ఖర్చు సామాన్య ప్రజలకు భారంగా మారిందని అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. విద్య అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అది వ్యాపారంగా మారడం ఆందోళనకరమని పేర్కొన్నారు. "క్యా బోల్తీ పబ్లిక్" కార్యక్రమం ద్వారా ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని, విద్య అందరికీ అందుబాటులో ఉండేలా అవసరమైన విధాన మార్పుల కోసం పోరాటం కొనసాగిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది.

## సైబర్ నేరగాళ్ల ఘాతుకం: ఆటోమేటిక్ ఏపీకె లింక్‌తో మూడే మూడు నిమిషాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడి ఖాతా నుంచి లక్ష రూపాయలు స్వాహా!



పల్లె వెలుగు -?ప్యాపిలి ప్యాపిలి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జింకల అంజి సైబర్ కేటుగాళ్ల మాయమాటల వలలో పడి లక్ష రూపాయలు పోగొట్టుకున్నారు. కంటిరెప్ప మూసి తెరిచేంత వ్యవధిలో, కేవలం మూడు నిమిషాల వ్యవధిలోనే ఆయన బ్యాంక్ ఖాతాను ఖాళీ చేసి సైబర్ నేరగాళ్లు తమ వికృత రూపాన్ని చూపించారు. మూడు రోజుల క్రితమే స్కెచ్.. అసలు ఏం జరిగింది? ఈ మోసం వెనుక సైబర్ నేరగాళ్లు ముందుగానే పక్కా వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. ?తొలి ప్రయత్నం విఫలం: సరిగ్గా మూడు రోజుల క్రితం జింకల అంజికి ఒక అపరిచిత ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను "బొంబాయి యూనియన్ బ్యాంక్" నుంచి మాట్లాడుతున్నానని చెప్పగా, అనుమానం వచ్చిన అంజి స్పందిస్తూ "ఫోన్ పెట్టేయ్" అని చెప్పి కాల్ కట్ చేశారు. ?మూడు రోజుల తర్వాత ఊహించని దెబ్బ లి
ఏ పి కె లింక్ ట్రాప్ తొలి ప్రయత్నం విఫలమైనప్పటికీ, కేటుగాళ్లు వదలకుండా మూడు రోజుల తర్వాత మళ్లీ పక్కా ప్రణాళికతో ఆయనను బురిడీ కొట్టించారు. ఈసారి ఆయన వాట్సాప్‌కు ఒక మోసపూరిత మెసేజ్ పంపారు. ఆ మెసేజ్‌లోని ఆటోమేటిక్ ఏపీకే ఏ పి కె లింక్ ఓపెన్ కాగానే ఫోన్ హ్యాక్ అయింది. క్షణాల్లో ఆయనను గందరగోళానికి గురిచేసి, వరుసగా మెసేజ్‌లు వచ్చేలా చేస్తూ కేవలం మూడే మూడు నిమిషాల వ్యవధిలోనే ఖాతాలోని రూ. లక్ష సొమ్మును వేరే ఖాతాలకు మళ్లించారు.
?పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు: లక్ష సొమ్మును మూడే నిమిషాల్లో సైబర్ నేరగాళు దోచుకెళ్లడంతో తీవ్ర ఆవేదనకు గురైన జింకల అంజి వెంటనే స్పందించారు. ఈ దారుణ మోసంపై ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.
?కేసు నమోదు చేసిన పోలీసులు లావాదేవీల ఆధారంగా విచారణ ప్రారంభించారు. డబ్బు ఏ బ్యాంక్ ఖాతాలోకి మళ్లిందో గుర్తించి, సొమ్మును హోల్డ్‌లో పెట్టేందుకు సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో చర్యలు వేగవంతం చేశారు.
?సైబర్ పోలీసుల అప్రమత్తత సూచనలు:
?అపరిచిత కాల్స్, లింక్స్ పట్ల జాగ్రత్త: బ్యాంక్ అధికారులమంటూ ఏ నగరాల నుంచైనా కాల్స్ వస్తే నమ్మవద్దు. అలాగే వాట్సాప్, ఎస్ఎంఎస్‌లలో వచ్చే అపరిచిత లింక్‌లు, ముఖ్యంగా ఏపీకె ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదు.
?రహస్య వివరాలు ఇవ్వొద్దు: బ్యాంకులు ఎప్పుడూ ఫోన్‌లలో, సందేశాల్లో వ్యక్తిగత వివరాలు అడగవు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ,పిన్ నంబర్లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు.
?'1930' కి వెంటనే ఫిర్యాదు చేయండి: సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే ఆ సొమ్మును హోల్డ్ చేయించి, రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.

### ల్యాప్‌టాప్‌లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని

# రీ-సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

**విలేజ్ సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచన.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రభుత్వం రీ-సర్వే కార్యక్రమం కోసం అందజేస్తున్న ల్యాప్‌టాప్‌లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని రీ-సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా విలేజ్ సర్వేయర్లను ఆదేశించారు.

శుక్రవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సర్వే శాఖ ద్వారా సరఫరా చేయబడిన 30 హెచ్‌పీ కంపెనీ ల్యాప్‌టాప్‌లను (ఒక్కొక్కటి సుమారు రూ. 1.53 లక్షల విలువ) రీ-సర్వే పనుల నిర్వహణ కోసం విలేజ్ సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకువస్తూ రీ-సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తోందన్నారు. వీటిని అత్యంత జాగ్రత్తగా సంరక్షిస్తూ పూర్తిస్థాయిలో వినియోగించి రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు..రీ-సర్వే చేపట్టే ముందు సంబంధిత భూ యజమానులకు ముందస్తుగా నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలోనే పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ప్రజలతో సమన్వయం పెంపొందిస్తూ ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామమోహన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిరాంలో అరుదైన శస్త్రచికిత్స..

**8 గంటల పోరాటం... నాలుగు మెదడు రక్తనాళ ఉబ్బరాలకు విజయవంతమైన చికిత్స..**
**రక్తప్రవాహాన్ని మళ్లించే ప్రత్యేక స్టెంట్, లియో స్టెంట్, ప్రత్యేక కాయిల్స్ సహాయంతో అరుదైన న్యూరో ఇంటర్వెన్షనల్ విజయం**



పాణ్యం ఆగస్టు 7 పల్లె వెలుగు : శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరో ,రక్తనాళాల ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అరుదైన,అత్యంత క్లిష్టమైన మెదడు రక్తనాళ చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది.మెదడు పొరల మధ్య రక్తస్రావం (సబ్ అరాక్‌నాయిడ్ రక్తస్రావం)తో అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి చేరిన ఒక రోగికి పరీక్షలు నిర్వహించగా, మెదడులో నాలుగు వేర్వేరు రక్తనాళ ఉబ్బరాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.రోగి పరిస్థితిని అత్యవసర వైద్య విభాగం, న్యూరాలజీ, న్యూరో శస్త్రచికిత్స, మత్తుమందు వైద్యం, క్రిటికల్ కేర్, న్యూరో ఇంటర్వెన్షనల్, రేడియాలజీ విభాగాల వైద్యులు సమిష్టిగా పరిశీలించి చికిత్స ప్రణాళిక రూపొందించారు.సుమారు 8 గంటల పాటు కొనసాగిన ఒకే ఎండోవాస్క్యులర్ ప్రక్రియలో రక్తప్రవాహాన్ని మళ్లించే ప్రత్యేక స్టెంట్‌తో కాయిలింగ్ విధానం, సిల్క్ విస్టా, రక్తప్రవాహ మళ్లింపు , స్టెంట్ లియో బ్రెయిడెడ్ మెదడు స్టెంట్, అలాగే ప్రత్యేక విడదీయగల కాయిల్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి అన్ని రక్తనాళ ఉబ్బరాలకు విజయవంతంగా చికిత్స అందించారు. చికిత్సలో భాగంగా కుడివైపు సుప్రాక్లినాయిడ్ అంతర్గత కరోటిడ్ ధమని లోని రక్తనాళ ఉబ్బరం మరియు దానికి సమీపంలోని బ్లిస్టర్ రక్తనాళ ఉబ్బరంకు రక్తప్రవాహ మళ్లింపు స్టెంట్‌తో కాయిలింగ్ విధానం ద్వారా చికిత్స అందించారు.అదేవిధంగా ఎడమవైపు పోస్టీరియర్ కమ్యూనికేటింగ్ ధమని లోని రక్తనాళ ఉబ్బరానికి కాయిలింగ్ చికిత్స, అలాగే బాసిలర్ ధమని చివరి భాగంలోని రక్తనాళ ఉబ్బరంకు లియో బ్రెయిడెడ్ మెదడు స్టెంట్ ద్వారా విజయవంతంగా చికిత్స చేశారు.ఈ సందర్భంగా న్యూరో మరియు రక్తనాళాల ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డా. నవీన్ కుమార్ గోడా మాట్లాడుతూ,ఒకే రోగిలో అనేక మెదడు రక్తనాళ ఉబ్బరాలు ఉన్నప్పుడు, వాటిలో ఏది పగిలిందో ఖచ్చితంగా గుర్తించి, ప్రతి ఉబ్బరానికి వేర్వేరు అత్యాధునిక ఎండోవాస్క్యులర్ పద్ధతులను ఒకే చికిత్సా ప్రక్రియలో సమన్వయం చేసి చికిత్స చేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అన్నారు.ఈ చికిత్స విజయవంతం కావడంలో ఆసుపత్రి ఎండి రఘురామ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి,మేనేజ్‌మెంట్ డైరెక్టర్లు ఫ్రాన్సిస్, శ్రీకాంత్ వైద్య బృందానికి అందించిన ప్రోత్సాహం కీలక పాత్ర పోషించాయన్నారు.ఈ కార్యక్రమంలో

మత్తుమందు వైద్య విభాగాధిపతి డాక్టర్ చెన్నకేశవ,క్రిటికల్ కేర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఫణీంద్ర, అత్యవసర వైద్య విభాగాధిపతి డాక్టర్ రఘునాథ్, న్యూరాలజిస్ట్ డాక్టర్ పవన్,న్యూరో శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ శివ రామిరెడి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ పనిల్, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మండల్ సామాజిక మహా విప్లవం




పల్లె వెలుగు: ఆగస్టు 7న అణగారిన గుండెల్లో అధికార గళమొకటి ఆశలై మోగింది. పార్లమెంట్ వేదికపై శతాబ్దాల చీకట్లను చీల్చుకుంటూ ఒక చారిత్రక సత్యం నిలిచింది. మొరార్జీ దేశాయ్ నాటిన బీజం.. బి.పి. మండల్ రూపొందించిన నివేదిక.. కాలగర్భంలో మగ్గిన బహుజనుల ఆవేదనకు వి.పి. సింగ్ ధైర్యం తోడై, నాడు పార్లమెంట్ సాక్షిగా హక్కుల హరివిల్లు అమలుకు నాంది పలికింది. సామాజిక న్యాయానికి బాటలు వేస్తూ 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా శ్రమజీవుల చేతులకు అధికార పీఠాల్లో భాగస్వామ్యం దక్కింది. కులం పేరుతో నిర్మించిన వివక్ష గోడలు బద్దలై అట్టడుగు వర్గాలకు ఆత్మగౌరవం లభించింది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎన్ని శక్తులు అడ్డుపడినా చరిత్రను మలిచిన ఆగస్టు 7 బహుజనుల పండుగ రోజుగా నిలిచింది. మండల్ ఇచ్చిన స్ఫూర్తితో సమానత్వం బాటలో సాగుదాం. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధనే లక్ష్యంగా సమిష్టి సమరం సాగిద్దాం. భారత రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక సమానత్వ సాధన కోసం ఉద్యమిద్దాం. మండల్ అంటే కేవలం రిజర్వేషన్లు కాదు.. శతాబ్దాలుగా కొనసాగిన అణచివేతపై సాధించిన విజయం. వి.పి. సింగ్ ఆనాడు వెలిగించిన సామాజిక న్యాయ దీప్తి నేటికీ బహుజనుల ప్రగతికి దిక్సూచిగా నిలుస్తోంది. నాటితో బానిసత్వపు సంకెళ్లు తెగిపోయాయి. ఇది కేవలం ఒక చట్టం కాదు.. తరతరాల అణిచివేతపై తిరగబడిన బహుజన గర్జన. మా రక్తంలో ప్రవహించే ఆత్మగౌరవాన్ని, మా చెమటతో నిర్మించిన ఈ దేశాన్ని శాసించే హక్కు మాకూ ఉందని చాటిన విప్లవ గీతం. నాటితో వివక్ష కోటలు కూలిపోయాయి. నేటితో సమానత్వ సమరం మొదలైంది. సామాజిక న్యాయం వర్ధిల్లాలి. ఓబీసీల వికాసమే వికసిత భారత లక్ష్య సాధనకు మార్గం కావాలి. (1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వి.పి. సింగ్ మండల్ కమిషన్ సిఫార్సులను పార్లమెంట్‌లో ప్రకటిస్తూ సామాజిక న్యాయ చరిత్రలో ఒక కీలక మలుపు తిప్పారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఆ రోజును పురస్కరించుకుని రాసిన కవిత.) -- నేదునూరి కనకయ్య అధ్యక్షులు

## 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు 11వ రోజుకు చేరుకున్న డోర్ టు డోర్ ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమం.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల టౌన్ పరిధిలోని 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు డోర్ టు డోర్
కార్యక్రమం 11వ రోజుకు చేరింది అని వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు అన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు,నంద్యాల ఎమ్మెల్యే, మంత్రి ఎన్ఎండి.ఫరూక్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి.ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు
ఎన్ ఎం డి.ఫయాజ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రతిరోజు ప్రజలతో మమేకమై వారి యొక్క సమస్యలు వింటూ మై టీడీపీ యాప్ ద్వారా నమోదు చేస్తున్నాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చంద్రన్న చికిత్స ద్వారా అందరికీ

## ఆరోగ్యముడాక్టర్ జి. రాజేష్ కుమార్ వైద్యాధికారి

బద్వేల్,ఆగస్ట్ 7 ( పల్లె వెలుగు ):బద్వేల్ మండలం తొట్టిగారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం





పరిధిలోని తిరువెంగలాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం లో, చంద్రన్న చికిత్స వాహనం లో డాక్టర్ జి.రాజేష్ కుమార్ వైద్యాధికారి తొట్టిగారిపల్లె బద్వేల్ వారు మాట్లాడుతూ, ఈ 104 వాహనం ద్వారా సంక్రమణ, అసంక్రమణ వ్యాధులు,మాతా, శిశు సంరక్షణ మొదలగు ఆరోగ్య కార్యక్రమంలో అన్నీ కూడా సంపూర్ణంగా ఇవ్వబడునని పేర్కొనడమైనది, అదేవిధంగా గ్రామాల నందు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకొని ,వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, దోమల ద్వారా వచ్చు అంటువ్యాధులను నివారణ చేసుకుని, లార్వాను అభివృద్ధి లేకుండా నీటి నిల్వలను తొలగించి ,దోమల ద్వారా వచ్చు అంటువ్యాధులను నివారణ చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అదేవిధంగా ప్రతి తల్లి కాన్పు అయినా వెంటనే గంటలోపు తల్లిపాలు తాపించాలని, తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను గురించి తల్లిదండ్రులకు పూర్తిగా అవగాహన కల్పించాలని,రాష్ట్రీయ బాలుల కార్యక్రమంలో ప్రతి పాఠశాల నందు ప్రతి విద్యార్థినీ, విద్యార్థులను స్క్రీనింగ్ చేసి ఏదైనా లోపం ఉన్నట్లయితే గుర్తించి ఆసుపత్రులకు రిఫరల్ చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని తెలిపారు. రాజేష్ కుమార్ విలేజ్ హెల్త్ క్లినిక్ లో మందులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం తిరువెంగల పురం అప్పర్ ప్రైమరి స్కూల్లో నందు విద్యార్థులకు స్క్రీనింగ్ , ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటిలోని అశుభ్రతమైనటువంటి టైర్లు, నీటి నిల్వ ఉన్నటువంటి డ్రమ్ములను పరిశీలించడమైనది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య ,బద్వేల్ సబ్మిట్ ఆఫీసర్ బ్రహ్మాజీ, హెల్త్ సూపర్వైజర్ సులోచన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హర్షిత, ఏఎన్ఎం మహాలక్ష్మి, కార్యకర్తలు పాల్గొనడం అయినది.

# పరిసరాల శుభ్రత- ఆరోగ్య భద్రత





బద్వేల్,ఆగస్టు 7 ( పల్లె వెలుగు)పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవడం వలన ఆరోగ్యం బాగుంటుందని సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు. బద్వేల్ పట్టణంలోని బావనారాయణ నగర్ లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని దర్శించి ఫీవర్, లార్వా, కరోనా సర్వే నిర్వహించి, సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ, డ్రైనేజీ కాలువలు గుర్తించి, నీరు నిల్వ లేకుండా చేస్తున్నామన్నారు. అప్డేట్, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి త్రాగునీరు అందించే ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఫీవర్ వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిస్తున్నామన్నారు. అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు కరోనా ఎక్కడ లేదన్నారు .వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం ఉందన్నారు. భయపడవలసిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్దన్ రావు ,వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది సుబ్బనర్సమ్మ, కుమారి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు,ఏ ఈ,హెచ్చరిక

దొర్నిపాడు ఆగస్టు 7 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని ఆయా గ్రామాలలో విద్యుత్ వినియోగించుకుంటున్న వినియోగదారులుగమనించదలచినది ఏమనగా గతంలో విద్యుత్తు బిల్లుల కొరకు బిల్ కలెక్టర్లు గ్రామాలలో దండోరా మైకుల ద్వారా ప్రచారం చేస్తూవారే మీ వద్దకు వచ్చి బిల్లులువసూలుచేసుకునేవారుకానీఇప్పటినుండి బిల్ కలెక్టర్లు గ్రామాలలో నీకి రారు, బిల్లు వసూలు చేయరు అని విద్యుత్ ఏఈ రామమోహన్ అన్నారు



ఈ సందర్భంగఆయనమాట్లాడుతూ బిల్లు వచ్చిన 14 రోజుల్లోపు తప్పనిసరిగా వినియోగదారులు చెల్లించాలి,అలా చెల్లించని వారిపై ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ కనెక్షన్ తొలగించడంతోపాటు అపరాధ రుసుముకూడా విద్యుత్ సిబ్బంది వసూలు చేస్తారని ఆయన వియోదారులకు హెచ్చరికలు జారీ చేశారు, ప్రతి శనివారం గ్రామాలలో ఉదయం 10 గంటలకునుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులుగమనించాలన్నారు, విద్యుత్తు మరమ్మతు లకారలంగా విద్యుత్కు అంతరాయం జరుగుతుందని ఆయన తెలిపారుఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

మహానంది, పల్లె వెలుగు రైతులు మొక్కజొన్న, వరి పంటల బదులు ప్రత్యామ్యాయ





పంటలపై దృష్టి సారించాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజ్ నాయక్,శాస్త్రవేత్తలు డాక్టర్. జాన్సన్ ,డాక్టర్ నారాయణ రావు సూచించారు. శుక్రవారం ఆళ్లగడ్డ మండలం ఆర్. కృష్ణాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం,మహానంది వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో పంటలు, ఎల్నినో ప్రభావం పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని కోరారు. మొక్కజొన్నలో సాలు మార్చి సాలు పద్ధతిలో నీటి తడులు ఇవ్వటం ద్వారా బెట్ట పరిస్థితిని అధిగమించవచ్చు అన్నారు.పంటపై బెట్ట పరిస్థితిని గమనించినప్పుడు పొటాషియం నైట్రైట్ 0.5 శాతం 2 శాతం యూరియాను పిచికారి చేయాలని సూచించారు. సాంద్రతను ఎక్కువగా లేకుండా చూసుకోవాలన్నారు. అంతర పంట సరళిని అవలంబించటం వలన పంట నష్టం కొంతమేర తగ్గుతుందన్నారు. నాణ్యమైన విత్తనం, విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు.క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట రమణమ్మ,డాక్టర్ వెంకటరమణ,యం. జోష్ణ కిరణ్ మై, ఏ డి ఏ విజయ్ శేఖర్, ఏఈఓ నరసింహ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కర్నూలు యువకుడు దుర్మరణం



?పల్లె వెలుగు –ప్యాపిలి అనంతపురంలో శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ?పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు నగరం గణేష్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ ముఖిత్ (26) అనంతపురంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా, అరుణాచల ట్రాన్స్పోర్ట్ దగ్గర మార్గమధ్యంలో అతడు ప్రయాణిస్తున్న వాహనం అకస్మాత్తుగా అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని



అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముఖిత్‌ను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతూ కోలుకోలేక ఉదయం 10:30 గంటల సమయంలో అబ్దుల్ ముఖిత్ తుదిశ్వాస విడిచాడు. చేతికి అందిన కుమారుడు కళ్లముందే అనంత లోకాలకు వెళ్లడంతో మృతుడి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుటుంబానికి అండగా ఉంటాం,

### - 8వ వార్డు టిడిపి నాయకులు,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 7 ఎమ్మిగనూరు పట్టణం 8వ వార్డులోని నివసిస్తున్న తెలుగుదేశ కార్యకర్త నరసింహ (22) నిన్నటి రోజున అనారోగ్య సమస్యలను మరణించారు

ఎమ్మెల్యేబీవీ జయనాగేశ్వర్ రెడ్డిఆదేశాల మేరకు టౌన్ సెక్రటరీ కదిరికోటఅనిల్ యోసేప్ మరియు జగత ప్రతాప్ఆధ్వర్యంలో నరసింహ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఓదార్పులుస్తూ అంత్యక్రియల నిర్వహణ కోసం ఆర్థిక సహాయాన్ని అందజేసి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో8 వార్డు వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు మద్రి కిరణ్, మద్రి సీమోను, జె వినయ్, ప్రవీణ్, సందీప్, ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు

## రైతు చాకలి మద్దిలేటి డాక్యుమెంట్ దొరికితే ఇవ్వండి

దొర్నిపాడుఆగస్టు 7 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోనిగోవిం దిన్నేగ్రామానికి చెందిన రైతు చాకలి చింత కుంటబాలమది లేటికీచెందినపొలండాక్యుమెంటుపత్రాలు ఎవరికైనా కనబడిన దొరికిన ఇవ్వాలని బాధితులు బాలమదిరెడ్డి ప్రజలను కోరారు, పత్రాల విషయమై దొర్నిపాడు ఎస్సైని సంప్రదించగా విచారణ చేస్తామని అన్నట్లు సమాచారం రైతు చాకలి బాల మద్దిలేటికి చెందిన భూమి వివరాల ప్రకారము సర్వేనెంబర్ 1081 విస్తీర్ణం మూడు ఎకరాల 50 సెంట్లు అదేవిధంగా పొలం డాక్యుమెంట్ నెంబర్ 14 77 బార్ 2007 ఈ నెంబర్ గల డాక్యుమెంట్స్ దొరికితే ఇవ్వవలసిందిగా కోరుచున్నారు బాధితులు

## దేవుడి దగ్గరికి దారి ఇప్పించండి...గొడ్లవీడు గ్రామ మాలలు

### గ్రామస్తులకు అండగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జక్కుల కిరణ్

బ్రహ్మంగారిమఠం, ఆగస్ట్7 ( పల్లె వెలుగు)కడప



జిల్లా,మైదుకూరు నియోజకవర్గం, బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోగల గొడ్లవీడు గ్రామంలో మాల కులానికి చెందిన సుమారు 100 కుటుంబాలు నివాసం ఉంటున్నారు.వీరు తమ పూర్వీకుల కాలం నుంచి కూడా హిందువులు గానే జీవిస్తున్నారు.అయితే అదే గ్రామంలో పురాతనమైన వేణుగోపాల స్వామి దేవాలయం కలదు.సదరు దేవాలయానికి గ్రామంలోని 100 కుటుంబాలకు



చెందిన మాలలు అందరూ వెళ్ళుటకు పూర్వం నుండి కూడా దారి లేకపోవడంతో వేణుగోపాలస్వామి కి చెందిన దేవుడి మాన్యం 12 ఎకరాలు ఉండగా ఆ పొలం గట్ల వెంబడి వెళ్లేవారు.కానీ ప్రస్తుతం అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తులు సదరు దేవుడు మాన్యానికి కంచ ఏర్పాటు చేసి గ్రామంలోని మాలలందరిని వేణుగోపాల స్వామిగుడి దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు.అందుకు గ్రామంలోని మాలలు అందరూ మాకు ఒక వైపు దేవాలయంకు దారి వదిలి కంచె ఏర్పాటు చేయమని అడగగా మీ మాలలకు వేణుగోపాలస్వామికి సంబంధం ఏంటి మీరు దేవాలయానికి రావద్దు,మీకు దారి వదిలే ప్రసక్తే లేదు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నారు. సదరు సమస్య విషయమై గ్రామస్తులు మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షులు జక్కుల కిరణ్ ను సంప్రదించగా గ్రామానికి చెందిన మాలలకు న్యాయం చేయాలన్న రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ ఆ దేశాల మేరకు బ్రహ్మంగారిమఠం మండల తాసిల్దార్ గారిని కలిసి జిల్లా అధ్యక్షుడు జక్కుల కిరణ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అర్జీ ఇవ్వడం జరిగినది. తాసిల్దార్ గారు స్పందిస్తూ దేవుడి మన్యానికి కంచె ఏర్పాటు చేసే అధికారం ఎవరికి లేదు, విచారణ జరిపి,దారి ఇప్పించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాల మహానాడు బ్రహ్మంగారిమఠం మండల అధ్యక్షులు బాల గురయ్యా,కాశి నాయన మండలాధ్యక్షుడు యోహాను, బద్వేల్ సహాయ కార్యదర్శి మనోహర్,రవి, మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## బాలాయ పల్లె పాఠశాల విద్యార్థులకు ఆర్.బి.ఎస్.కే (2వా) పరీక్షలు

కాశినాయన, ఆగస్ట్ 7 ( పల్లె వెలుగు): వైయస్సార్



కడప జిల్లా కాశినాయన మండలంలోని 0 నుండి 18 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆరోగ్య భరోసా కలిగించడమే ఆర్.బి.ఎస్.కే (2.0) రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని గొంటువారిపల్లె సచివాలయ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.నాగ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కాశినాయన మండలంలోని గొంటువారి పల్లె స్వర్ణ గ్రామ పరిధిలోని బాలాయపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్.ఎం పల్లా.దస్తగిరి బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.నాగ శిరీష మాట్లాడుతూ... గతంలో కేవలం సాధారణ ఆరోగ్య పరీక్షలకే పరిమితమైన ఈ ఆర్.బి.ఎస్.కే ఈ సంవత్సరం ఆర్.బి.ఎస్.కే (2.0) తో మరింత విస్తరించినట్లు ఆమె తెలిపారు. ముఖ్యంగా ఈసారి హిమోగ్లోబిన్ శాతం, ఎత్తు, బరువులు,మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ గ్రంధి సమస్యలు, మూత్రపిండాల వ్యాధులు, పుట్టుకతో మూత్రనాళాల లోపాలను గుర్తించి వాటిని డిజిటలైజేషన్ చేస్తామన్నారు.ఈ పరీక్షలు నిర్వహించి లోపాలు గుర్తించి ముందే చికిత్స అందించడం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. కావున విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యానికి బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.నాగ శిరీష, ఏ.ఎన్.ఎం లలితకుమారి,ఆశా కార్యకర్త మేరీ హేమలత,ఉపాధ్యాయులు పల్లా.దస్తగిరి బాబు, ఖాసీం వల్లి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి కూటమి సంక్షేమ పథకాలు.. ఎల్లార్తిలో ఘన ప్రచారం

**☛ఈబీజీ గోవింద్ గౌడ్‌కు ఎల్లార్తి ప్రజల ఘన స్వాగతం**

**☛అంబేద్కర్, కనకదాస విగ్రహాలకు నివాళులర్పించి ప్రచారానికి శ్రీకారం**

హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 07 ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు హొళగుంద మండలంలోని ఎల్లార్తి గ్రామంలో "ఇంటింటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ఈబీజీ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి విచ్చేసిన ఈబీజీ గోవింద్ గౌడ్‌కు గ్రామ ప్రజలు శాలువాలు, పూలహారాలతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆయన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, భక్త కనకదాస మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.తదుపరి 61, 62 బూత్‌ల పరిధిలో "ఇంటింటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటిని సందర్శించి, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రూ.4,000 సామాజిక పింఛన్, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, రైతు సంక్షేమం, విద్య, వైద్యం, మహిళా సాధికారత తదితర పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఈబీజీ గోవింద్ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు





నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోనే ఉంటూ పనిచేస్తున్నారని అన్నారు.

అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎస్. పంపపతి, యారిస్వామి, దీడి వెంకటేష్, బీజేపీ మండల కన్వీనర్ ప్రసాద్, సర్దార్, మహేష్, లింగప్ప, హుస్సేన్ పీరా, రామాంజి, దీడి నాగప్ప, దీడి వడ్డే యారిస్వామి, మల్లయ్య, యువ నాయకుడు ఈబీజీ రాజేంద్ర గౌడ్, టీడీపీ మండల మైనార్టీ అధ్యక్షుడు ముల్లా మొయిన్, పంచగుండిగ వెంకటేష్, మాజీ సర్పంచ్ హేసన్, ఈబాదుల్లా, టీడీపీ యువ నాయకుడు పవన్, హెచ్. మలయ్య, కో-క్లస్టర్ రారవి సిద్దు, బూత్ ఇన్‌చార్జి మలయ్య, రంగా, కానయ్య, జనసేన నాయకుడు వెంకటేష్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమానికి ఎల్లార్తి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, ఇంటింటికీ సంక్షేమ పథకాల వివరాలు చేరవేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

## వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పించాలి.

### ఆగస్టు 14న 'చలో ప్యాపిలి.



రుద్రవరం. పల్లె వెలుగు : వాల్మీకులకు ఎస్టీ హోదా సాధనే లక్ష్యంగా ఎంవీఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 14వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్యాపిలి జాతీయ రహదారిపై నిర్వహించే 'చలో ప్యాపిలి' (ఎస్టీ స్టేటస్ సాధన నిరసన) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక వాల్మీకి సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రం రుద్రవరంలో శుక్రవారం వారు మాట్లాడుతూ179 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికి, దశాబ్దాలుగా వాల్మీకులకు జరుగుతున్న చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యా, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించి రాజ్యాంగపరమైన హక్కులను పక్కాగా అమలు చేయాలని కోరుతూ, వాల్మీకుల భవిష్యత్ మరియు స్వాభిమానం కోసం చేస్తున్న ఈ పోరాటంలో రుద్రవరం పరిసర ప్రాంతాల వాల్మీకి సోదరీసోదరులంతా ఏకమై పెద్ద ఎత్తున ప్యాపిలికి కదలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోయ వెంకట సుబ్బయ్య, బాలు, నెంబర్ వన్ హుస్సేన్, బాల రంగయ్య, బోయ రమేష్, మధు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

**?హిందూపురంలో ఉత్సాహంగా 'ఇంటింటికీ తెలుగుదేశం--2026'**
**?చిలమతూరు మండల గ్రామాల్లో పర్యటించిన డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరావు యాదవ్**





పల్లె వెలుగు -ప్యాపిలి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, హిందూపురం నియోజకవర్గ శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం--2026 కార్యక్రమం చిలమతూరు మండలంలో శుక్రవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది.

?హిందూపురం నియోజకవర్గ పరిశీలకులు, కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. నాగేశ్వరావు యాదవ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. మండలంలోని కొండూరు, సుబ్బారావు పేట, మొరుసలపల్లె, కోడికొండ, దిగువపల్లి తదితర గ్రామాల్లోని కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

?కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి

?ఈ సందర్భంగా వై. నాగేశ్వరావు యాదవ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, ఉపాధి కల్పన, రైతుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోందన్నారు. తల్లికి వందనం, మెగా డీఎస్సీ, శ్రీశక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్ల దీపం పథకం, ఎన్టీఆర్ వైద్యసేవ, రూ.5లకే కడుపునిండా భోజనం అందించే అన్న క్యాంటీన్లు, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల కల్పన వంటి ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ప్రజలకు వివరించారు.

?అలాగే, హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నాయకత్వంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్తులకు తెలియజేశారు.

?కార్యకర్తలకు సన్మానం

?గ్రామాల్లో 'ఇంటింటికి చంద్రన్న భరోసా' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పార్టీ నాయకులు గోపి, గుర్రం నంజుండలను ఈ సందర్భంగా వై. నాగేశ్వరావు యాదవ్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.

?ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జులు శ్రీదేవి, గంగాధర్, నరసింహమూర్తి; క్లస్టర్ ఇంచార్జులు రంగారెడ్డి, నందిశప్ప; బూత్ ఇంచార్జులు వెంకటసుబ్బయ్య, ఎహోయితుల, గుర్రం నంజుండ, మధు కృష్ణ, సతీష్, శివనాయక్, గోపి, రహమతుల్ల, సూర్య నారాయణ రెడ్డి, నాగరాజు, గంగాధర్, నరేష్, శ్రీరామ్, మంజునాథ్, సోహెల్, మల్లికార్జున, రఫీక్, ముస్తఫా పాల్గొన్నారు.

?అలాగే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహాయకులు శ్రీనివాసులు, బాలాజీలతో పాటు స్థానిక నాయకులు అంజి, మురళి, వేమనారాయణ, ఎంపీటీసీ కొండప్ప, మహిళా మండలి విజయలక్ష్మి, సర్పంచ్ బాలాజీ పాల్గొన్నారు.

### ఐఎంఏ మహిళా వైద్యుల ఆధ్వర్యంలో

# ఘనంగా ముగిసిన తల్లిపాల వారోత్సవాలు.

**శుక్రవారం ఒకే రోజు ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలు.**
**200 మంది చంటి పిల్లల తల్లులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లు ,బ్రెడ్లు పంపిణీ.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.తల్లిపాల వారోత్సవాల ముగింపు రోజైన శుక్రవారం నంద్యాల ఐ ఎం ఏ మహిళా వైద్యుల విభాగం, నంద్యాల గైనకాలజీ వైద్యుల సంఘం సంయుక్త నిర్వహణలో పట్టణంలోని ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లలో, ఐదు మహిళా వైద్యుల బృందాలుగా పాల్గొని చంటి పిల్లల తల్లులకు, గర్భిణీ స్త్రీలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, ఐదు సెంటర్లలో కలిపి 200 మంది పైగా చంటి పిల్లల తల్లులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

హరిజనవాడ అర్బన్ హెల్త్ సెంటర్లో నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, నంద్యాల గైనకాలజీ వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమణి డాక్టర్ వసుధారాణి, ఐఎంఏ మహిళా వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ సునీత, నంద్యాల మెడికల్ స్పెషాలిటీ అకాడమీ కార్యదర్శి డాక్టర్ లలిత, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గగన్, జగజ్జనని అర్బన్ హెల్త్ సెంటర్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దినేష్ రెడ్డి,డాక్టర్ నర్మదా, డాక్టర్ ధనలక్ష్మి, శ్రీనివాస్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీరజ,డాక్టర్ అరుణకుమారి డాక్టర్ నాగరేఖ, ఎమ్మెస్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కావ్య, డాక్టర్ కల్పన, డాక్టర్ సరిత, ఎన్జీవోస్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ లో మెడికల్ ఆఫీసర్ యమునా వాణి ,డాక్టర్ లక్ష్మీ సౌజన్య, వివిధ కేంద్రాలలో డాక్టర్ తనూజ, డాక్టర్ అనూష, డాక్టర్ రజని, డాక్టర్ శిల్పా, డాక్టర్ శశి కిరణ్, డాక్టర్ రాధిక, డాక్టర్ శివ జ్యోతి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

# డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ నిరసన జ్వాల.. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు.

**● డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి: ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా,రాష్ట్ర సీఈసీ నెంబర్ మాజీ మార్క్ఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి. ● వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల గాంధీ చౌక్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజుకు చేరాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నాయకత్వంలో, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి.

రెండో రోజు నిరసన కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గ పరిధిలోని గోస్పాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు మరియు వారి తల్లిదండ్రులు భారీగా పాల్గొని దీక్షా శిబిరానికి పూర్తి సంఘీభావాన్ని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను, ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. 2025 డీఎస్సీ ప్రక్రియలో అనేక ఆక్రమాలు చోటుచేసుకున్నాయని, అర్హులైన అభ్యర్థులు తమకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించుకున్నా ఎలాంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. న్యాయం కోసం నిరుద్యోగ అభ్యర్థులు రోడ్డుక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు: కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల (ఎమ్మెల్యేలు, ఎంపీలు) ప్రమేయంతో అర్హత లేని వారికి, క్రీడలతో సంబంధం లేని వారికి స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు కల్పించి, అసలైన అర్హులైన అభ్యర్థుల పొట్ట కొట్టారని ఎమ్మెల్సీ ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగులు తిరగబడితే అధికార పీఠం కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు.

ఈ డీఎస్సీ అక్రమాలపై తక్షణమే కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చేత విచారణ జరిపించాలని, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడినందుకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి కౌన్సిల్ మెంబర్ రామలింగారెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమన్, రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిసా, నంద్యాల జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసీపీ జిల్లా ఎస్టి విభాగం జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, సాయిరాం రెడ్డి,గోస్పాడు మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, నిరుద్యోగ యువత ,విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిపాలు అమృతంతో సమానం



రుద్రవరం.పల్లె వెలుగు : తల్లి బిడ్డకు పట్టేపాలు అమృతంతో సమానమని కోటకొండ అంగన్వాడి కార్యకర్త రమణమ్మ , ముత్తలూరు అంగన్వాడి కార్యకర్తలు రాజేశ్వరి, సుగుణ శ్రీ, రాజకుమారి లు తెలిపారు. శుక్రవారం మండలంలోని కోటకొండ, ముత్తలూరు గ్రామం లో ఉన్న అంగన్వాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా వారు మాట్లాడుతూ తల్లులకు పాల ప్రాముఖ్యత గురించి పుట్టిన గంటలో తల్లిపాలు ఇవ్వాలని 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు .ఉద్యోగం చేసే మహిళలు తల్లిపాలను గాజు గ్లాసులలో పిండి ఫ్రిజ్లో పెట్టుకొని బిడ్డకు పాలు ఇవ్వాలి, అంతేకానీ ఉద్యోగం చేస్తున్నామని పాలు ఇవ్వకుండా ఉండకూడదు అన్నారు. తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధిక శక్తి పెరుగుతుంది తద్వారా వ్యాధులనుండి ఎదుర్కొనే శక్తి ఉంటుందన్నారు .తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా సహాయపడుతుందన్నారు. 7 నెలల తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ హారము ద్రవపదార్థాలతో కూడిన అనుబంధ ఆహారం ఇవ్వాలని చక్కర పప్పు ఆయిల్ ఎక్కువ వాడకూడదన్నారు. అతి తక్కువ మోతాదులు ఉపయోగించి బిడ్డకు అనుబంధం ఆహారం ఇవ్వాలి తద్వారా పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో కోటకొండ గ్రామం హెల్త్ అసిస్టెంట్ వసుంధర,మహిళా పోలీస్ త్రివేణి, ఆశా కార్యకర్త సుజాత, ఆయా నాగలక్ష్మి ముత్తలూరు గ్రామం ఎంఎల్ హెచ్ పి సుస్మిత, ఏఎన్ఎం సారమ్మ, తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించిన జిల్లా పోలీసులు..



పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ వేడుకగా ప్రకటించిన శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా, నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ బాషా ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభ్యున్నతికి విశేష కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, విద్యావేత్త, సామాజిక చైతన్యవేత్త అని, సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీని రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకగా నిర్వహిస్తూ గౌరవించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తో పాటు ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ , ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు విజయ్ సురేష్ మరియు సిబ్బంది పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించడం జరిగింది.

## కొలనుభారతిలో వైభవంగా శాకాంబరీ ఉత్సవం.

**-మార్కెట్ ప్రసాద్ దంపతులకు దేవస్థానం ఘన సన్మానం.**



పల్లె వెలుగు నంద్యాల రూరల్. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం దేవస్థానం దత్తత ఆలయమైన కొలనుభారతి క్షేత్రంలో శుక్రవారం సరస్వతీ అమ్మవారికి శాకాంబరీ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, మహానైవేద్యం నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తొలిసారిగా నిర్వహించడం విశేషమని దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవానికి అవసరమైన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను దాత మార్కెట్ ప్రసాద్ సమకూర్చగా, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టిబొట్ల భరద్వాజ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. ఉత్సవం విజయవంతానికి అందించిన విశేష సహకారాన్ని గుర్తిస్తూ మార్కెట్ ప్రసాద్ దంపతులను దేవస్థానం తరపున ఘనంగా సన్మానించి, జ్ఞాపిక (మెమెంటో) అందజేసి అభినందించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, ఆర్జిత సేవలు, మహానైవేద్యం, భక్తుల దర్శనాలు సక్రమంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి మండల అధ్యక్షునిగా రాంబాబు



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం నందిపల్లె గ్రామానికి చెందిన గోపిశెట్టి రాంబాబు బిజెపి మండల అధ్యక్షునిగా శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అధ్యక్షునిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, కిసాన్ మోర్చా రాష్ట్ర సీడ్స్ సెల్ కన్వీనర్ పడకండ్ల నాగేశ్వరరావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తాను అని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

# రైతన్న కోసం క్షేత్రంలోకి అధికారులు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన.**



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మండలంలోని అన్ని గ్రామాల్లో 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధరరావుతో కలిసి పులిమద్ది, భీమవరం గ్రామాల్లో రైతులను కలిసి పంటల పరిస్థితిని పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి, మిరప వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా మినుము, పెసర, ఆముదం, కొర్ర వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటల సంరక్షణకు అవసరమైన యాజమాన్య పద్ధతులను వివరించారు. గ్రామాల్లోని పంటల వివరాలను ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేయడంతో పాటు నమోదు కాని పంటలను కూడా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఖాళీ భూముల్లో పీఎండీఎస్ కిట్‌లోని విత్తనాలను విత్తన బంతుల రూపంలో వెదజల్లాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది రాము నాయక్, లలితతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం: ఇద్దరు బిఎల్‌ఓలు సస్పెండ్



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (రాజూవఎఋశ్రీ ×త్వఅంఆజవ =వజఋంఆశీఅ) విధుల్లో నిర్లక్ష్యం వహించి, అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించిన ఇద్దరు బూత్ స్థాయి అధికారులను (దీూా) సస్పెండ్ చేస్తూ కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ సి.ఓబులేసు ఆగస్టు 7న ఉత్తర్వులు జారీ చేశారు.
138–పాణ్యం శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రం–92 బిఎల్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న వార్డు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి బి.గిరిబాబు, పోలింగ్ కేంద్రం–101 బిఎల్‌ఓగా ఉన్న బస్తిపాటి పరమేశ్వరులు ఈ చర్యలకు గురయ్యారు. అధికారుల నివేదిక ఆధారంగా చర్యలు కల్లూరు మండలం ఎఈఆర్‌ఓ (ూాజు=ూ) అలాగే తహసీల్దార్ పంపిన నివేదిక ప్రకారం, ఈ ఇద్దరు వార్డు కార్యదర్శులు బిఎల్‌ఓ విధులు చేపట్టడానికి హాజరుకాకపోవడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాలను తీవ్రంగా ఉల్లంఘించినట్లు వెల్లడైంది. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్ 1964లోని రూల్ 3తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 32ను ఉల్లంఘించినందుకు గానూ వీరిపై క్రమశిక్షణా చర్యలు చేపడుతూ, విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్‌లో ఉంచుతున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు.
సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ వదిలి వెళ్లకూడదని, వారికి నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 7: ఆరోగ్య శ్రీ పథకం రూపకర్త పథకం అమలు కోసం పోరాడిన పద్మశ్రీ మందకృష్ణ పోరాటాన్నిస్మరించుకుంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం బండి ఆత్మకూరులో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని నిర్వహించారు. పేదలకు ఉచిత వైద్యం అందించే ఆరోగ్య శ్రీ పథకం ఏర్పాటు వెనుక ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ 2004వ సంవత్సరంలో నిర్వహించిన చారిత్రక పోరాటాలను గుర్తు చేశారు. ప్రతి ఏటా ఆగస్టు 7న ఆరోగ్య శ్రీ సాధన దినోత్సవం అని పేర్కొన్నారు. గుండె జబ్బులతో బాధపడుతున్న పేద చిన్నారుల ప్రాణాలను కాపాడాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించిన పోరాటాల ఫలితంగా కారణంగా ఆంధ్రప్రదేశ్లో పేదవాడికి కార్పొరేట్ పథకం రూపొందించుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి సంబరం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకట సుబ్బన్న ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి పాలుట్ల సురేష్ ఉపాధ్యక్షుడు నాగన్న ఉపాధ్యక్షుడు నాగన్న,దశరధుడు, పడవ రామదాసు, పుల్లయ్య,జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీలేయర్ వర్తించదని కేంద్రం అఫిడవిట్ హర్షణీయం



ఎమ్మిగనూరు, ఆగస్టు 7 (పల్లె వెలుగు): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీలేయర్ సూత్రం వర్తించదని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించడం హర్షణీయమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న అన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఓబీసీలకు అమలు చేస్తున్న క్రీమీలేయర్ విధానాన్ని ఎస్సీ, ఎస్టీలకు వర్తింపజేయాలన్న పిటిషన్లను కేంద్రం వ్యతిరేకించడం శుభ పరిణామమన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీలేయర్ వర్తించదని అశోక్ కుమార్ ఠాకూర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గతంలోనే స్పష్టం చేసిందని కేంద్రం తన అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించేలా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి కదిరికోట ఆదెన్న కృతజ్ఞతలు తెలిపారు.

# డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి

## -- విజయవాడ దీక్ష శిబిరంపై దాడిని ఖండించిన పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

పోరుమామిళ్ల, ఆగస్టు 7 ( పల్లె వెలుగు )రాష్ట్రంలో



డీఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు.
డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో నిరాహార దీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో మాజీ మంత్రి మల్లాది విష్ణు చేపట్టిన నిరాహార దీక్ష శిబిరంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు.స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమా తన అనుచరులతో కలిసి దీక్ష శిబిరంపై దాడి చేసి, కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయడం వల్ల మల్లాది విష్ణుతో పాటు పలువురు కార్యకర్తలు గాయపడినట్లు ఆరోపించారు. ఈ ఘటనకు ముందు దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన భద్రతా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పోలీసుల సమక్షంలోనే దౌర్జన్యాలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం, విమర్శించే గొంతులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అన్యాయంగా కేసులు నమోదు చేస్తున్న తీరుపై న్యాయస్థానాలు కూడా పలుమార్లు ప్రశ్నించినా పోలీసుల వైఖరిలో మార్పు కనిపించడం లేదని అన్నారు.మాచర్ల, పొన్నూరు, రేపల్లె, అనంతపురం, తాడిపత్రి, వేమూరు తదితర ప్రాంతాల్లో కూడా నిరాహార దీక్ష శిబిరాలపై దాడులు జరిగాయని ఆరోపిస్తూ, ఈ ఘటనలన్నింటిపై పోలీసులు నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు.

# ఈ-క్రాప్ నమోదు పక్రియ కచ్చితంగా 100 శాతం నమోదు చేయాలి.

- **రైతులు సాగు చేసిన ప్రతి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ క్రాప్ లో కచ్చితంగా నమోదు చేయాలి.**
- **అర్హులైన రైతులు పంటల బీమా పథకం లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలి.**
- **ప్రకృతి వ్యవసాయం, పి ఎం డి ఎస్ పై రైతులు అందరికీ అవగాహన కల్పించాలి.**
- **జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ, పంటల బీమా సంబంధిత ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఉద్యాన శాఖ అధికారి, సహాయ సంచాలకులు మండల వ్యవసాయ అధికారులు రైతు సేవా కేంద్ర సిబ్బంది లతో, నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్




పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన ప్రతి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ క్రాప్ లో కచ్చితంగా నమోదు చేయాలన్నారు. నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.
పంటల బీమా పథకంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన రైతులు నిర్దేశిత గడువులోగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో అధికారులుదృష్టి పంటల బీమా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.
ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వర్షపాతం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతన్న మీకోసం ఎల్ నినో కార్యక్రమంలో పాల్గొని ,రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించేలా అవగాహన కల్పించాలని, రిజర్వాయర్లలో నీటి లభ్యత లేనందువలన వరి పంట సాగు చేయరాదని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, పి ఎం డి ఎస్ పై రైతులు అందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. బహువార్షిక పంటలు నమోదు చేసి పక్రియ ను పూర్తి చేయాలని తెలిపారు. రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ఎస్ ఓ పి ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో సెంట్రింగ్

## కార్మికుడు దుర్మరణం: కర్నూలు కొత్త అయ్యప్పస్వామి గుడి వద్ద ఘటన

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో టిప్పర్ వాహనం






నిర్లక్ష్యంగా ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ విషాద సంఘటన కర్నూలు నగర పరిధిలోని కొత్త అయ్యప్ప స్వామి గుడి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు మరియు బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి...
కర్నూలు టౌన్, బుధవారపేటకు చెందిన బి. ఉసేని కుమారుడు బంగి పరమేష్ (25) సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పరమేష్‌కు ఇంకా వివాహం కాలేదు. గురువారం (ఆగస్టు 6) రాత్రి 10:00 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనం (ూా39 ఖీ–3544) పై స్నేహితుడు గణేష్‌తో కలిసి బిర్లాగడ్డ వద్ద ఉన్న కాంట్రాక్టర్‌ను కలిసేందుకు వెళ్లాడు. పని విషయమై కాంట్రాక్టర్‌తో మాట్లాడి తిరిగి ఇంటికి వస్తుండగా, రాత్రి 10:30 గంటల ప్రాంతంలో కొత్త అయ్యప్ప స్వామి గుడికి కొద్ది దూరంలో ఉన్న అగ్రసేని హాస్పిటల్ మలుపు వద్ద ఎదురుగా వచ్చిన టిప్పర్ వాహనం (ూా 39ఔచీ–0378) అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ రోడ్డుపై ఎగిరిపడ్డారు. తీవ్రగాయాలపాలైన పరమేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా, వెనుక కూర్చున్న గణేష్ కుడికాలి వేళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన గణేష్, స్థానిక ఆటోలో పరమేష్‌ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు (++ు) తరలించి, మృతుడి తల్లి సునీతకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకోగా, రాత్రి 10:45 గంటల సమయంలో క్యాజువల్టీ వార్డు వైద్యులు పరీక్షించి పరమేష్ అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి హుసేనయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు. చేతికి అందిన కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో బుధవారపేటలో విషాదఛాయలు అలముకున్నాయి.

# రెండేళ్ల అభివృద్ధి

**సంక్షేమం... ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం,**



నందవరం పల్లె వెలుగు ఆగస్టు 7 నందవరం మండల పరిధిలో ముగతి గ్రామం రెండేళ్ల పాలనపై ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మొదటి తెలుగుదేశం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు. నందవరం మండల పరిధిలో ముగతి గ్రామంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మగతి ఈరన్న గౌడ్, నందవరం మండల ఆర్గనైజింగ్ అసిస్టెంట్ ముగతి భార్గవ యాదవ్, ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు,గొర్రెలు సంఘం అధ్యక్షులు కొండారెడ్డి,మాజీ సర్పంచ్ బాలరాజు,చాకలి రామకృష్ణ,వెంకటేష్ గౌడ్,ఫీల్డ్ అసిస్టెంట్ కదుబూరి,మోష,సుధాకర్, రాజేష్,ఈ. వెంకటేష్ గౌడ్, నరసన్న,నురేష్,నరసింహులు,స్టూడెంట్ నాయకుడు అర్జున్ యాదవ్,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ

☛కల్లూరు 41వ వార్డులో వైభవంగా '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం' కార్యక్రమం

☛ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలపై ప్రచారం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి ధ్యేయంగానే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు మండలంలోని 41వ వార్డు పరిధిలోని బీసీ కాలనీ (నిర్మల కిరాణం లైన్) మరియు మారుతి నగర్‌లలో '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఆమె విస్తృత ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 37వ వార్డు ఇన్‌చార్జి సుతారు రాఘవేంద్ర, క్లస్టర్ కో-కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, సీనియర్ నాయకులు ఇమ్మానియేల్, యూనిట్ ఇన్‌చార్జి ఖాదర్ వలి, బూత్ ఇన్‌చార్జిలు బాలకృష్ణ, సుబ్బరాయుడు, వెంకటేష్, సురేష్ ఆచారి, అనిల్, అన్వర్, నరసింహులు మరియు పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో కన్నులపండువగా శాకాంబరీ దేవి అలంకరణ

☛ఆషాఢ మాసం సందర్భంగా వైభవంగా లక్ష కుంకుమార్చన పూజలు

☛అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో అవధూత దత్త పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో నగరంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మహా గౌరీ అమ్మవారిని 'శాకాంబరీ దేవి'గా దివ్యంగా అలంకరించారు. శుక్రవారం ఆలయంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.





ఈ సందర్భంగా ఆలయంలో షోడశోపచార పూజ, శ్రీదేవి ఖడ్గమాల, లలితా సహస్రనామ, లలిత త్రిశతి, లలిత అష్టోత్తర, అన్నపూర్ణ అష్టోత్తర, దుర్గా అష్టోత్తర పారాయణాల పూర్వకంగా 'లక్ష కుంకుమార్చన'ను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ విశేష పూజల్లో నగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులయ్యారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు మరియు మాతృమండలి సభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. 'జయ గురుదత్త' నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా



వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ అధికారులు ప్రత్యేక నివారణ చర్యలు తీసుకోవడంతో పాటు స్కూళ్లలో, కళాశాలలో, విద్యాసంస్థలలో యువతకు ట్రాఫిక్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి సుస్మిత ఐపీఎస్ సూచనలతో నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆర్ జి సుబ్రహ్మణ్యం మరియు వారి సిబ్బంది సహకారంతో నంద్యాల పట్టణంలోని సన్‌రైజ్ జూనియర్ కళాశాలవిద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు మరియు రహ్‌వీర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాన్ని అతివేగంగా నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.
అలాగే రహదారిపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచికలు, వేగ పరిమితులు పాటించాలని, పాదచారులు మరియు ఇతర వాహనదారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు వివరించారు.
చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలకు దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.
రహ్‌వీర్ పథకం గురించి విద్యార్థులకు వివరిస్తూ, రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు గాయపడిన వ్యక్తులకు సకాలంలో సహాయం అందించడం, ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను చూసి భయపడకుండా, బాధితులకు సాధ్యమైనంత త్వరగా సహాయం అందించడంతో పాటు సంబంధిత అత్యవసర సేవలకు సమాచారం అందించాలని తెలిపారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు "ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం -- రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం -- ప్రాణాలను కాపాడుదాం" అనే సందేశాన్ని అందించారు.
విద్యార్థులు స్వయంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మరియు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ ఉనికి కోసమే 'రిలే దీక్షల' నాటకం.

## వైసీపీ డ్రామాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు: నంద్యాల టీడీపీ నాయకుల తీవ్ర ఆగ్రహం.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పారదర్శకంగా పూర్తయిన మెగా డీఎస్సీ-2025 పై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని నంద్యాల తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. నంద్యాలలో వైసీపీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి శుక్రవారం వారు మాట్లాడారు.
ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్లు మిద్దె ఉసేని, కొండారెడ్డి, నంద్యాల మండల టీడీపీ కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, నాయకులు అయ్యలూరు త్రిలింగేశ్వర్ రెడ్డి, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, వీర సింహారెడ్డి, యాలూరు వెంకట్ రెడ్డి, నాగరత్నమ్మ లు సంయుక్తంగా మాట్లాడుతూ... నంద్యాలలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో అసలైన డీఎస్సీ అభ్యర్థులు లేరని అన్నారు. రాష్ట్రంలోనూ, నంద్యాలలోనూ వైసీపీ పూర్తిగా ఉనికి కోల్పోతోందని, కనుమరుగవుతున్న తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే నాయకులు ఇటువంటి నాటకాలకు తెరలేపారని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి గా నారా లోకేష్ విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలు, నిరుద్యోగులకు కల్పిస్తున్న ఉద్యోగావకాశాలు, రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్చుకోలేకే వైసీపీ నాయకులు ఆయనపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసలు మంత్రి లోకేష్ ఎందుకు రాజీనామా చేయాలో కూడా చెప్పలేని స్థితిలో వైసీపీ నేతలు ఉన్నారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తమ వైఖరి మార్చుకొని, బుద్ధి తెచ్చుకుని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ-కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని హితవు పలికారు.

# విద్యార్థినులు, మహిళలు శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.



పల్లెవెలుగు కర్నూలు క్రైమ. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు కర్నూల్ మహిళా పీఎస్ డీఎస్పీ ఎం. ఉపేంద్ర బాబు వారి పర్యవేక్ష ణలో జిల్లా వ్యాప్తంగా పాఠశాల లు, కళాశాలల్లో శక్తి యాప్ అవ గాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో భాగం గా శుక్రవారం కర్నూలు టౌన్ పరిధిలోని గవర్నమెంట్ టౌన్ మోడల్ హైస్కూల్లో విద్యార్థిను లకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు.కర్నూలు మహిళా పీఎస్ డి. మస్తాన్ వలి మాట్లా డుతూ, ఆపత్కాలంలో మహిళ లు, విద్యార్థినులకు శక్తి యాప్ రక్షణగా నిలుస్తుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి వాట్సాప్ నంబర్7993485111 కు కాల్ లేదా మెసేజ్ చేసిన వెం టనే పోలీసులు స్పందించి అవస రమైన చర్యలు చేపడతారని చె ప్పారు. ప్రతి మహిళ, విద్యార్థిని తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూ చించారు.అలాగే ఎమర్జెన్సీ డ యల్-112, మహిళల హెల్ప్ లైన్-181, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 ద్వారా కూడా ఫిర్యాదులు నమో దు చేయవచ్చని వివరించారు. ఈ సందర్భంగా మహిళల భద్ర త, బాల్య వివాహాల నివారణ, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ప్రేమ పేరుతో మోసా లు, సైబర్ నేరాలు, సోషల్ మీడి యా ప్రభావం, శక్తి యాప్ విని యోగం, శక్తి [illegible] బటన్ ద్వారా ఫిర్యాదు చేసే విధానంపై విద్యా ర్థినులకు అవగాహన కల్పించా రు.ఈ కార్యక్రమంలో జిల్లా శక్తి టీం సభ్యులు హెడ్ కానిస్టేబుళ్లు ఎం. మహబూబ్ ఖాన్, సి. విజ యభాస్కర్ , పాఠశాల ప్రధానో పాధ్యాయులు,ఉపాధ్యాయులు , విద్యార్థినులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుడు ఇంతియాజ్

## బాషా హత్య తీవ్ర దిగ్భ్రాంతికరం: రాష్ట్ర మంత్రి టీజీ భరత్

☛బాధ్యులను వదిలే ప్రసక్తి లేదు.. చట్టం చేతుల్లోకి తీసుకుంటే ఊరుకోం

☛కర్నూలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో తెలుగుదేశం పార్టీ నాయకుడు ఇంతియాజ్ బాషా దారుణ హత్యకు గురికావడంపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ దారుణానికి ఒడిగట్టిన ఎంతటివారినైనా చట్టం ముందు నిలబెడతామని, బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. ఈ సంఘటనపై మంత్రి టీజీ భరత్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్ధరాత్రి వేళ జరిగిన ఈ హత్యతో ప్రశాంతంగా ఉండే కర్నూలు నగర ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలతో లేదా ఇతర కారణాలతో వైసిపి నేతలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇంతియాజ్ బాషా మృతి ఆయన కుటుంబానికి, పార్టీకి తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు మంత్రి తన ఆత్మీయ సానుభూతిని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజలకు మెరుగైన సేవలందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కర్నూలులోని మాధవినగర్‌గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'గ్రీవెన్స్ డేవ్' (ప్రజా సమస్యల వినతుల స్వీకరణ) కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజల నుంచి ఆమె స్వయంగా అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు. ప్రతి వినతికీ ప్రాధాన్యత ఇస్తూ, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు అందేలా నిరంతరం కృషి చేస్తాం. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పార్నపల్లెలో జిల్లా మలేరియా అధికారి

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 7: నంద్యాల జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ శుక్రవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలో పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా పార్నపల్లి గ్రామంలోని సుంకులమ్మ వీధిలో మలేరియా అధికారి పర్యటించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా తమ పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న ఉద్దేశంతో వీధుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రమ్ములలో నిల్వ ఉన్న వాడని నీటిని పరిశీలించి వాటిని పారబోయించారు. ఇంటి ముందర ఉన్న టైర్లు, పాత డ్రమ్ములలో నీరు నిల్వ ఉంచితే దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని ప్రజలకు సూచించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతమైన వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తమ బాధ్యతగా గుర్తించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త చక్రవర్తి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

# ఎల్నినో ప్రభావ నివారణకు

**పార్నపల్లెలో రైతన్న మీకోసం వారోత్సవాలు**

**పాల్గొన్న కలెక్టర్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా**

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 7: బండి







ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలో రైతన్న మీకోసం వారత్సవాల కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి పాల్గొని రైతన్న మీకోసం వారోత్సవాల చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026 ఖరీఫ్ సీజన్‌లో ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు "రైతన్నా మీకోసం వారోత్సవాలు" రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని 2026 ఆగస్టు 7 నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా నంద్యాల జి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు, వ్యవసాయ అనుబంధ శాఖ జిల్లా అధికారులు, బండి ఆత్మకూరు మండల స్థాయి అధికారులు తాసిల్దార్ పద్మావతమ్మ ఏఓ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు:

రాష్ట్రంలోని 100% రైతులు మరియు వ్యవసాయ భూములను సర్వే చేయడం.

ప్రతి పొలాన్ని సందర్శించి పంట స్థితి, తేమ కొరత, తెగుళ్లు, ఎండిపోతున్న పంటలు, ఖాళీ భూములను గుర్తించడం.అవసరమైన చోట వెంటనే నివారణ చర్యలు చేపట్టడం.

ఏపీ ఏఐఎంఎస్ 2.0 మరియు ఫార్మర్ యాప్ ద్వారా డిజిటల్ పర్యవేక్షణ నిర్వహించడం.

ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద బహుళ శాఖల కమిటీ ఏర్పాటు చేసి, ప్రతి రైతు మరియు ప్రతి భూమిని సందర్శించి ఈ-పంట నమోదు చేయాలి.

పంట పరిస్థితిని బట్టి చేపట్టాల్సిన చర్యలు:

ప్రాణాధార నీటిపారుదల ( లైఫ్ సేవింగ్ ఇరిగేషన్),రక్షణాత్మక (స్ప్రేలు, మల్చింగ్, ప్రీ మానుసూన్ డ్రై సోయింగ్, విత్తన పెల్లెటింగ్,అంతర పంటలు,స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి.

ఈ కార్యక్రమం రెండు దశల్లో అమలు:

1. మొదటి 7 రోజులు: ప్రతి పొలం పరిశీలన, పంట నిర్ధారణ, వ-జతీశీజూ నమోదు, రైతులకు తక్షణ సలహాలు.

2. తదుపరి 2–9 వారాలు: నివారణ చర్యల అమలు, పునఃసందర్శనలు, ఫోటోలు అప్లోడ్ చేసి పురోగతి నమోదు.

రైతు యాప్ డౌన్‌లోడ్, ఈ-పంట నమోదు, సాగ పురోగతి, పంట ఆరోగ్యం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తారు.

వ్యవసాయ మరియు ఇతర శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి, రోజువారీ సమీక్షలు నిర్వహించాలి.

అనంతరం రైతులకు ఎల్ నైనో పరిస్థితుల్లో ప్రతానమాయ పంటలపై అవగాహన కల్పించే కర పత్రాలను విడుదల చేసి రైతులకు పంపిణీ చేశారు.

# జాతీయ మొక్క జొన్న బోర్డును ఏర్పాటు చేయండి.

పల్లె వెలుగు న్యూఢిల్లీ జాతీయ మొక్క జొన్న



బోర్డును ఏర్పాటు చేయాలని శుక్రవారం భారత పార్లమెంట్ లో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభ జీరో అవర్ లో కోరారు.

ఈ సందర్భంగా లోక్ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ భారతదేశానికి మొక్కజొన్న ఒక వ్యూహాత్మక పంటగా ఆవిర్భవించిందని నేను చెప్పదలుచుకున్నాను అన్నారు. ఒకప్పుడు కేవలం ఒక ధాన్యంగా మాత్రమే పరిగణించబడిన మొక్కజొన్న పంట ఇప్పుడు ఆహారం, ఇంధనం, పశుగ్రాసానికి కేంద్రంగా మారిందని, వరి, గోధుమల తర్వాత మూడవ అతిపెద్ద ధాన్యంగా మొక్కజొన్న ఆహార భద్రతకు, కోళ్లు, పశుసంపద రంగానికి, భారతదేశపు ఇథనాల్ మిశ్రణ కార్యక్రమానికి తోడ్పడుతుందన్నారు. అంతేకాకుండా, దీనికి తక్కువ నీరు అవసరమవుతుందని, వాతావరణ మార్పులను తట్టుకునే గొప్ప సామర్థ్యం మొక్క జొన్నకు ఉందన్నారు.

మొక్కజొన్న సాగు రాయలసీమ, ఆంధ్రప్రదేశ్‌లకు ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తుందనీ. గత మూడు దశాబ్దాలుగా, రాష్ట్రంలో మొక్కజొన్న సాగు గణనీయంగా విస్తరించిందని, ఉత్పత్తి, ఉత్పాదకతలో చెప్పుకోదగ్గ వృద్ధి నమోదైందన్నారు. అయినప్పటికీ, వరి, గోధుమలకు లభించే సంస్థాగత మద్దతు మొక్కజొన్న పంటకు ఇప్పటికీ లేదనీ. రైతులు హామీతో కూడిన కొనుగోలు కేంద్రాల కొరత, ధరల అస్థిరత, ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడటం, ఆహారం, పశు గ్రాసం, ఇథనాల్ డిమాండ్‌ను సమతుల్యం చేసే యంత్రాంగం లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ దృష్టికి తెచ్చారు.

నంద్యాల జిల్లాతో పాటు రాయలసీమ అంతటా, తగినంత కొనుగోలు మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల మొక్కజొన్న సాగు రైతులు తరచుగా లాభదాయకం కాని ధరలకు అమ్ముకోవలసి వస్తోందనీ, అందువల్ల, కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) ఆధారంగా కొనుగోలును నిర్ధారించడానికి, ప్రధాన ఉత్పత్తి ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి, ధరలను స్థిరీకరించడానికి, వివిధ రంగాలలో మొక్కజొన్న వినియోగాన్ని సమన్వయం చేయడానికి, మెట్ట భూములకు ప్రత్యేకమైన రకాలను ప్రోత్సహించడానికి, ఇతర ప్రధాన పంటలకు అందుబాటులో ఉన్నటువంటి సంస్థాగత మద్దతును మొక్కజొన్న రైతులకు అందించడానికి ఒక జాతీయ మొక్కజొన్న బోర్డును ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని నేను కోరుతున్నానని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం

**☛వచ్చే వారం రోజుల్లో వంద శాతం ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు**

**☛జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 7:

ప్రజలు పీజీఆర్ఎస్ కార్యక్రమంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి ఫిర్యాదును కేవలం పరిష్కరించినట్లు నమోదు చేయడం కాకుండా, ప్రజలకు పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగే విధంగా నాణ్యమైన, సమగ్ర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. వన్ మంత్ ఫోర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం లోని బండి ఆత్మకూరు మండలం, పార్న పల్లె గ్రామంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి , జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ లు, అడిషనల్ ఎస్పీ సుస్మిత రంగనాథన్ తో కలిసి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారుప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయగా, ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఈ విడతతో ఆ ప్రాంతానికి సంబంధించిన పీజీఆర్ఎస్ ప్రక్రియ కూడా పూర్తికానుందని పేర్కొన్నారు.

శ్రీశైలం నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 1,322 ఫిర్యాదులు అందగా, వాటిలో 723 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈరోజు అందిన వినతులతో కలిపి మొత్తం ఫిర్యాదుల సంఖ్య దాదాపు 2 వేల వరకు చేరే అవకాశం ఉందన్నారు. మిగిలిన ఫిర్యాదులను ఈ వారంలో పూర్తిస్థాయిలో పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం అందించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు..ఫిర్యాదులను కేవలం ముగించడం కాకుండా, ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరే విధంగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర పరిష్కారం అందించాలని కలెక్టర్ సూచించారు.

ముఖ్యంగా అభివృద్ధి పనులకు సంబంధించినవి, ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు



ప్రాధాన్యతనిస్తూ పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. పరిష్కరించిన ముఖ్యమైన అంశాలకు ప్రజాప్రతినిధుల సమక్షంలో ధృవీకరణ (ఎండార్స్‌మెంట్) కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు.

సంబంధం లేని శాఖల నుంచి సమాధానాలు ఇవ్వడం, సరైన వివరణ లేకుండా ఫిర్యాదులను మూసివేయడం వంటి చర్యలు ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఫిర్యాదుల పరిష్కార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు..వచ్చే మంగళవారం అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, ఫిర్యాదుల పరిష్కార పురోగతితో పాటు వాటి నాణ్యతను కూడా సమీక్షిస్తామని తెలిపారు. యాదృచ్ఛికంగా ఎంపిక చేసిన ఫిర్యాదుల పరిష్కారాలను, వాటికి సంబంధించిన ఎండార్స్‌మెంట్‌లను పరిశీలిస్తామని చెప్పారు. వారం రోజుల్లో వంద శాతం ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

ఆత్మకూరు, మహానంది, వెలుగోడు, శ్రీశైలం నియోజకవర్గాల్లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమాలకు ప్రజలు విశేషంగా స్పందించారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు నమ్మకంతో సమర్పించిన ప్రతి వినతిపత్రానికి ప్రాధాన్యతనిస్తూ పరిష్కారం అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే కుటుంబ వివాదాలు వంటి కొన్ని అంశాలు ప్రభుత్వ పరిధిలో నేరుగా పరిష్కరించలేని కారణంగా పెండింగ్‌లో ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాంటి ఫిర్యాదులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో సంబంధిత ఫిర్యాదుదారులకు స్పష్టమైన సమాచారం అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి

నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువయ్యేలా రూపొందించిన మంచి కార్యక్రమమని ఎమ్మెల్యే తెలిపారు. సాధారణంగా జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలానికి విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే స్వీకరించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు అందిన ఫిర్యాదుల్లో అధిక శాతం సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేశారని తెలిపారు. గత నెల రోజులుగా జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా శ్రమించారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఇన్చార్జి డిపిఓ లలిత బాయ్,ఆత్మకూరు ఆర్డీవో వెంకట శివ, డి ఎల్ డి ఓ అన్వరా బేగం, మార్క్ ఫెడ్ ఏడి అబ్దుల్ రహమాన్, మండల స్పెషల్ ఆఫీసర్ లీలావతి,మండల తాసిల్దార్ పద్మావతమ్మ, ఎంపీడీవో గాయత్రి, ఏపీవో వసుధా రెడ్డి తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాస్త్రవేత్త రవీంద్రనాథ్ కు గౌరవ డాక్టరేట్.. అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ...

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. వ్యవసాయ పరిశోధన రంగంలో విశేష



సేవలందించిన నంద్యాలకు చెందిన విశ్రాంత అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కాదర్ బాద్ రవీంద్రనాథ్ కు అరుదైన గౌరవం దక్కింది. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవ సాయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మెరుగైన నూతన వంగడాల సృష్టితో రైతాంగానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం వరించింది. నంద్యాల వాసికి రాష్ట్ర స్థాయిలో ఈ అత్యున్నత గౌరవం దక్కడం పట్ల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, మరియు నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి వైసీపీ రాష్ట్ర రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి,తో పాటు పలువురు రైతు, సామాజిక, సాహితీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## నంద్యాల టీడీపీ కార్యకర్త షేక్ ఇబ్రహీం కు అరుదైన గుర్తింపు... సైకిల్ ను బహుకరించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణం 5 వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీలక కార్యకర్త షేక్ ఇబ్రహీం కు పార్టీ అధిష్టానం నుండి అరుదైన గుర్తింపు లభించింది. టీడీపీ పార్టీ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, కష్టపడే తత్వానికి మెచ్చిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ , ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ పంపిన సైకిల్ బహుమతిని నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ అందజేశారు. ఈసందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ మై టీడీపి యాప్ ద్వారా పార్టీ ఇచ్చే ప్రతి ఆదేశాన్ని షేక్ ఇబ్రహీం తూచా తప్పకుండా పాటిస్తున్నారని, సోషల్ మీడియా వేదికగా పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాలను తిప్పికొడుతూ, నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. పార్టీకి కష్టపడే కార్యకర్తలే అసలైన ఆస్తి అని, వారిని పార్టీ ఎల్లప్పుడూ గుర్తిస్తుందని, ఇబ్రహీం కృషికి పార్టీ ఇస్తున్న గుర్తింపునకు ఇది నిదర్శనమని అన్నారు . భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి ఫరూక్ సూచించారు.

## రాంపల్లి మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి




ఘట్‌కేసర్, ఆగస్టు 7 (పల్లె వెలుగు): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి గ్రామ శ్రీ మహంకాళి దేవస్థానం కమిటీ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ఆలయాన్ని సందర్శించి మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని మహంకాళి అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాంపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది.

## తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం





మహానంది, పల్లె వెలుగు తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తిమ్మాపురం వైద్యాధికారి డాక్టర్ వేణు కార్తికేయ పేర్కొన్నారు. శు క్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట కవిత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బిడ్డ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లీ బిడ్డకు పాలివ్వడం వల్ల గర్భాశయ, రొమ్ముక్యాన్సర్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ.. తల్లిపాల వల్ల పుట్టిన శిశువుకు సరైన పోషణ అంది రోగ నిరోధకశక్తి పెరిగి అలర్జీ ప్రమాదాలు తగ్గుతాయని, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టాలన్నారు.తల్లిపాలు శివువుకు అమృతం లాంటిదని, తల్లిపాలు శిశువుకు సులువుగా జీర్ణమవుతాయన్నారు. ఎంపీహెచ్ఈఓ హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ..తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణులు, బాలింతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ అమీనాబి, అంగన్వాడీ టీచర్లు సావిత్రి, పుష్పలత, లక్ష్మీదేవి, చంద్రాలీల, హుస్సేన్ బి, గర్భవతులు, బాలింతలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.